క్లుప్తంగా

జీపీ భవనానికి భూమిపూజ



గాంధారి(ఎల్లారెడ్డి): గ్రామ పంచాయతీ భవనాన్ని నాణ్యతతో నిర్మించాలని ఎంపీపీ రాధా బలరామ్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని గుడిమెనుక తండాలో జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. సర్పంచ్ ధారావత్ బుజ్జి, ఎంపీటీసీ మాంగి బాయి పాల్గొన్నారు.

కుల సంఘ భవనాలకు..



భిక్కనూరు: మండలంలోని కంచర్లలో కుమ్మరి సంఘ భవనం, రామేశ్వర్‌పల్లి వీరశైవ సంఘ భవన నిర్మాణానికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణరెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ తాను ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో కామారెడ్డిలో బీజేపీ గెలుపు తథ్యమన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



బిచ్కుంద(జుక్కల్): వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్య ఆరోగ్య బోధకుడు దస్తిరాం అన్నారు. శుక్రవారం బిచ్కుందలో పర్యటించి ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు.

జీపీ భవనం కోసం కొనసాగుతున్న ఆందోళనలు

గాంధారి(ఎల్లారెడ్డి): జీపీ భవనం కోసం మండలంలోని నర్సాపూర్, మొండిసడక్ గ్రామస్తులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నర్సాపూర్, మొండిసడక్ గ్రామస్తులు పోటాపోటీగా వంటా వార్పు చేసి రోడ్డుపై భోజనాలు చేశారు. మొండిసడక్-నర్సాపూర్ జీపీ భవనం కోసం రూ.20 లక్షలు మంజూరయ్యాయి. భవనాన్ని తమ ఊర్లో తమ ఊర్లో నిర్మించాలని మొండిసడక్, నర్సాపూర్ గ్రామస్తులు నిరసన చేస్తున్న విషయం విదితమే.

బాన్సువాడను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

బాన్సువాడ: బాన్సువాడను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం బాన్సువాడ సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బాన్సువాడ, జుక్కల్, నారాయణ్‌ఖేడ్, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు బాన్సువాడ దగ్గరగా ఉంటుందని, ఆయా ప్రాంతాల ప్రజలు కామారెడ్డికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. శ్రీనివాస్, భూమయ్య, సురేష్, సురేష్‌బాబు, అశోక్, రాజు, జ్యోతి, లక్ష్మి ఉన్నారు.

కొత్త ఓటర్లను నమోదు చేయించాలి

మాచారెడ్డి: బీఎల్‌వోలు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయించాలని మాచారెడ్డి తహసీల్దార్ సూచించారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెల 26, 27 సెప్టెంబర్ 2,3 తేదీల్లో ఓటరు నమోదుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

పంటల పరిశీలన

గాంధారి: మండలంలోని పలు గ్రామాల్లో పంటలను శుక్రవారం ఏవో నరేశ్ పరిశీలించారు. చీడ పీడల నుంచి పంటల రక్షణకు తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి రైతులకు సూచించినట్లు ఏవో తెలిపారు.

పంట వివరాలను నమోదు చేసుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): రైతులు పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఏఈవో రూప సూచించారు. శుక్రవారం మండలంలోని బేగంపూర్ శివారులో పంట వివరాలను నమోదు చేశారు.

కంటి వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): పిట్లం ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.కంటి వైద్య నిపుణులు హరికిషన్‌రావు 62 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఎనిమిది మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరిని ఆపరేషన్ నిమిత్తం బోధన్ కంటి ఆస్పత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, సభ్యులు కాశిరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

రోడ్లకు మోక్షమెప్పుడో?

- నాలుగు గ్రామాల బీటీరోడ్లకు ఏడు నెలల క్రితం నిధులు మంజూరు
- టెండర్లు వేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- మట్టి రోడ్లతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అధ్వానంగా ఉన్న బెజుగం చెరువు తండా మట్టి రోడ్డు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మట్టిరోడ్డు తిప్పలు తప్పుతాయని ఆశించిన ఆ గ్రామాల ప్రజలకు నిరాశే మిగిలింది. నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభం అవుతాయని అనుకున్న వారి ఆశలు అడియాసలయ్యాయి. నాగిరెడ్డిపేట మండలంలోని రాఘవపల్లి, మహాదేవునిగడ్డతండా, మెల్లకుంట తండా, బెజుగం చెరువు తండాలకు వెళ్లే రోడ్లను బీటీగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జనవరిలో అవసరమైన నిధులను సైతం మంజూరు చేసింది. కాని పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. మండలంలోని రాఘవపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుపై గతంలో వేసిన బీటీరోడ్డు పూర్తిగా ధ్వంసమయింది. బెజుగం చెరువు తండాకు వెళ్లేందుకు చాలాకాలంగా మట్టి రోడ్డే ఉంది. చిరుజల్లులు కురిస్తేచాలు ఆ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారుతుంది. పెద్ద పెద్ద గుంతలతోపాటు బురదమయంగా మారిన రోడ్డుపైనే తండావాసులు రాకపోకలు సాగిస్తూ తిప్పలు పడుతున్నారు. మహాదేవునిగడ్డతండా, మెల్లకుంటతండాలకు వెళ్లే రోడ్డును సైతం బీటీగా మార్చేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. కాని పనులు చేపట్టేందుకు అధికారులు టెండర్లను ఆహ్వానించగా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడంలేదని తెలిసింది. దీంతో గత ఏడు నెలలుగా నిధులున్నా పనులు ప్రారంభం కావడంలేదు. మహాదేవునిగడ్డ తండాలో 600మీటర్ల బీటీ రోడ్డు ఏర్పాటుకు రూ.48లక్షలు, బెజుగం చెరువు తండాలో 2.8కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.24కోట్లు, రాఘవపల్లిలో 650మీటర్ల రోడ్డు రెన్యూవల్ కోసం రూ.40లక్షలు, మెల్లకుంటతండాలో 1.8కిలోమీటర్ల రోడ్డు కోసం రూ.కోటి10లక్షలు ప్రభుత్వం కేటాయించింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు సర్వే చేశారు



మా తండాకు వెళ్లేందుకు మట్టి రోడ్డే ఉంది. వర్షం పడిన ప్రతిసారీ రోడ్డంతా బురదమయంగా మారుతుంది. దీంతో తండాకు వచ్చిపోయే వారందరూ చాలా ఇబ్బందులు పడతారు. రోడ్డు వేస్తామని సర్వే చేశారు. కానీ పనులు ప్రారంభించలేదు.

– బాబునాయక్, బెజుగంచెరువు తండా

రోడ్డు కోసం ఎదురుచూస్తున్నాం



మా తండాకు బీటీ రోడ్డు ఎప్పుడూ వేస్తారా అని చాలాకాలంగా ఎదురు చూస్తున్నాం. మట్టిరోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలి.

– తుల్జ్యానాయక్, బెజుగంచెరువు తండా

ఘనంగా వరలక్ష్మి వ్రతాలు



లింగంపేటలో వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు

సాక్షి, నెట్‌వర్క్: శ్రావణ రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మి వ్రతం పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇళ్లల్లో లక్ష్మీదేవి చిత్రపటాలను ఉంచి పూలు, పండ్లతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



తాండూర్‌లో..



మహమ్మద్‌నగర్‌లో.. వరలక్ష్మి మాత



పెద్దమల్లారెడ్డిలో..

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



దోమకొండలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై మురళి



పిట్లంలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

దోమకొండ: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మురళి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో ఈవిషయంపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఏఎస్సై సుబ్రహ్మణ్యాచారి, సింగిల్‌విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

పిట్లం(జుక్కల్): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై విజయ్‌కొండ హెచ్చరించారు. ఆయన శుక్రవారం సిబ్బందితో కలిసి పిట్లం శివారులోని ప్రధాన రహదారులలో వాహనాలను తనిఖీ చేశారు. సిబ్బంది సాయగౌడ్, ఓంకార్, మోయిన్, మారుతి పాల్గొన్నారు.

బీబీపేట: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం ఎస్సై సాయిరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. నాలుగు జిల్లాలకు సరిహద్దులో ఉన్నందున్న ఎప్పటికప్పుడు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పెద్దకొడప్‌గల్: వాహనాల ధ్రువపత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని ఏఎస్సై రాములు వాహనదారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని బేగంపూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేశారు. సిబ్బంది శంకర్, అంజి, రవి, శ్రీనివాస్ ఉన్నారు.

అనుమతి లేకుండా ధర్నాలు చేయొద్దు

మద్నూర్(జుక్కల్): జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టొద్దని ఎస్సై కృష్ణారెడ్డి సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పోలీసుల సూచనలను పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

మద్నూర్(జుక్కల్): బిచ్కుందలో మూడు రోజుల క్రితం శాంతియుతంగా ఆందోళన చేపట్టిన బీజేపీ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేసినా ఇంత వరకు కేసు నమోదు చేయలేదని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్నూర్ పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, పిట్లం, డోంగ్లీ మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు హన్మండ్లు మాట్లాడుతూ బిచ్కుందలో నిరసన తెలపడానికి వెళ్లిన బీజేపీ నాయకులు, కార్యకర్తలపై బీఆర్ఎస్ నాయకులు వెంబడించి కొట్టారన్నారు. ఇదంతా ఎమ్మెల్యే సమక్షంలోనే జరిగిందని ఆరోపించారు. ఎస్సై కృష్ణారెడ్డి ఆందోళనకారులను సముదాయించారు. దీంతో బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేసి ఆందోళన విరమించారు.

కామిశెట్టిపల్లిలో కార్డన్ సెర్చ్

నస్రుల్లాబాద్: మండలంలోని కామిశెట్టిపల్లిలో శుక్రవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ధృవపత్రాలు లేని పలు వాహనాలను సీజ్ చేశారు. సీఐ మురళి మాట్లాడుతూ ప్రజలకు సైబర్ నేరాలు, మహిళా చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఏఎస్సై అబీద్ బేగ్ పాల్గొన్నారు.

బాన్సువాడలో ఇంటింటికీ కాంగ్రెస్



బాన్సువాడ: పట్టణంలో శుక్రవారం ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.500కే సిలిండర్, పింఛన్లు రూ.4 వేలు, నిరుద్యోగ భృతి రూ. 4 వేలు, రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఖలేక్, అసద్, మంత్రి గణేష్, అఫ్రోజ్, శ్రీనివాస్, నార్ల రఘు, గుడాల నగేష్, సాయిలు, గంగాధర్, వెంకన్న, షోహబ్, సలీం, మతీన్, అలీం ఉన్నారు.

మౌంటెడ్ స్ప్రేయర్‌పై అవగాహన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి సింగిల్ విండో కార్యాలయం ఆధ్వర్యంలో ఇఫ్కో కంపెనీ ట్రాక్టర్ ద్వారా మౌంటెడ్ స్ప్రేయర్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ట్రాక్టర్ ద్వారా స్ప్రేయర్ చేసే విధానం గురించి విండో చైర్మన్ సదాశివరెడ్డి వివరించారు. రైతులు తమ పంటలకు నానో యూరియా, డీఏపీ, పురుగు మందులు, తెగులు మందులు దీనిద్వారా పిచికారి చేయొచ్చన్నారు. ఇఫ్కో ప్రతినిధి నరేశ్, డైరెక్టర్‌లు భాస్కర్, రైతుబంధు అధ్యక్షుడు బాల్‌రాజ్, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల సిద్దిరాములు పాల్గొన్నారు.



ఎల్‌వోసీ అందజేత



మాచారెడ్డి: మండలంలోని అక్కాపూర్ గ్రామానికి చెందిన బేతి రాజుకు శుక్రవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సీఎంఆర్ఎఫ్ కింద రూ.రెండు లక్షల ఎల్‌వోసీ అందజేశారు. ఇటీవల రాజు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. ఈ మేరకు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ఎల్‌వోసీ అందజేశారు. గ్రామస్తులు బాబు, శ్రీనివాస్‌రెడ్డి, దశరథ్ ఉన్నారు.

పశువులకు టీకాలు

నస్రుల్లాబాద్: మండలంలోని దుర్కి గ్రామంలో శుక్రవారం పశువులకు గాలి కుంటు టీకాలను గ్రామ సర్పంచ్ శ్యామల వేశారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కుమ్మరి నారాయణ, వెటర్నరీ వైద్యులు తుకారాం, బాబయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం కొట్టాల్‌లోని అంగన్‌వాడీ టీచర్ మంజులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మంజుల అంగన్‌వాడీ కేంద్రాన్ని తీయడం లేదని, బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం లేదని వారు ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కార్యాలయం ఎదుట కూర్చుని వారు నిరసన తెలిపారు.

యుద్ధభేరికి తరలిన యాదవులు



దోమకొండ: హైదరాబాద్‌లో జరిగిన ఛలో యుద్ధభేరి కార్యక్రమానికి శుక్రవారం యాదవ సంఘం ప్రతినిధులు వాహనాల్లో తరలివెళ్లారు. యాదవులకు రాజకీయాల్లో గుర్తింపు ఇచ్చి టికెట్లు ఇవ్వాలని డిమండ్ చేస్తూ వాహనాల్లో తరలివెళ్లారు. యాదవ సంఘం జిల్లా కార్యదర్శి నేతుల సుధాకర్, నేతుల మల్లేశం, నాగరాజు, అశోక్, ఎల్లం, రాజాయాదవ్, లింగం, ఆకుల రాజయ్య, దేవరాజ్ యాదవ్ ఉన్నారు.

ఆధ్యాత్మికం

సరస్వతి ఆలయంలో పూజలు



కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణ పరిధిలోని ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన శ్రీ సరస్వతీ మాత ఆలయంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. అర్చకులు దత్తాద్రిశర్మ, విజయ్‌పాండే, సురజ్‌పాండే ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకం చేశారు. చిన్నారులకు అక్షరభ్యాసం, అన్నప్రసన చేయించారు. అనంతరం లలితా సహస్రనామాలతో కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలల సిద్దాగౌడ్, రోండ్ల నారాయణరెడ్డి, చామంతుల రాజిరెడ్డి సరోజ, మామిండ్ల రాజేందర్ చంద్రకళ పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీ సేవా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం కావడంతో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తరలి వచ్చి ఈ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా లక్ష పుష్పార్చన

దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని లక్ష పువ్వులతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలను చేశారు. గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి, ఆలయ కమిటి చైర్మన్ పాలకుర్తి శేఖర్, డైరెక్టర్లు రాజిరెడ్డి, నవీన్, రాజనర్సు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహిళల దీక్ష



ఐకేపీ సీఏ ఇంటి వద్ద దీక్ష చేస్తున్న మహిళలు

నిజాంసాగర్(జుక్కల్): నాలుగు రోజుల నుంచి నిరసన దీక్ష చేస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం లేదని ఐకేపీ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని హసన్‌పల్లిలో శుక్రవారం నాలుగో రోజు మహిళలు దీక్ష కొనసాగించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి డబ్బులు సొంతానికి వాడుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఏ స్వప్న ఇంటిని నిర్బంధించారు. 11 సంఘాలకు సంబంధించి పొదుపు డబ్బులు రూ.26 లక్షలు కాజేసిన సంగతి తెలిసిందే. సీఏ ఇంటి వద్దే మహిళలు వంటావార్పు చేస్తూ రాత్రి వేళల్లో రోడ్డుపైన నిద్రిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని మహిళలు కోరుతున్నారు.

ఎన్నిక, నియామకం

అఖిలభారత యాదవ మహాసభ కార్యవర్గం



బీబీపేట: అఖిల భారత యాదవ మహాసభ మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు అరికల ప్రభాకర్ యాదవ్ తెలిపారు. మాందాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఆకుల వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా బైరయ్య, రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం, యూత్ అధ్యక్షుడిగా దోసేటి కిరణ్, ఉపాధ్యక్షుడిగా ఆకుల మహేష్, కార్యదర్శిగా గొల్ల చంద్రయ్య, రమేష్, ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా హన్మాండ్లుయాదవ్



నస్రుల్లాబాద్(బాన్సువాడ): బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా మండలంలోని అంకోల్ గ్రామానికి చెందిన హన్మాండ్లు యాదవ్ నియమితులయ్యారు. తనపై నమ్మకంతో నియమించిన జిల్లా అధ్యక్షురాలు అరుణతారకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా నాంపల్లి శ్యాం

బాన్సువాడ: బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా నాంపల్లి శ్యాంను నియమించినట్లు పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందన్నారు. నాయకులు పైడిమల్ లక్ష్మీనారాయణ, హన్మండ్లు, కోనాల గంగారెడ్డి, శంకర్‌గౌడ్, గంగారం, రాము, సాయికిరణ్, రాజాసింగ్, అశ్విన్ ఉన్నారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా స్వామి



దోమకొండ: దోమకొండకు చెందిన అబ్రబోయిన స్వామి కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ నియామకపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

దేవునిపల్లి బిజినెస్ సిండికేట్ కార్యవర్గం..



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి బిజినెస్ సిండికేట్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి రామ్మోహన్, ఉపాధ్యక్షులుగా గోలి నరేష్ కుమార్, నీలం సురేష్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ నవీన్, సహాయ కార్యదర్శులుగా కృష్ణ, కె రాజు, కోశాధికారిగా స్వామి, ప్రధాన సలహాదారులుగా లింగారావు, మోహన్, దేవరాములును ఎన్నుకున్నారు.

సంక్షిప్తం

రేవంత్‌రెడ్డి సీఎం కావాలని పాదయాత్ర

ఎల్లారెడ్డి: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సీఎం కావాలని కాంగ్రెస్ కార్యకర్త సతీష్ శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఎల్లారెడ్డి మండలానికి చెందిన సతీష్ ఎల్లారెడ్డి నుంచి బడా పహాడ్ వరకు పాదయాత్రను శుక్రవారం ప్రారంభించారు. రేవంత్‌రెడ్డి సీఎం కావాలని, షబ్బీర్ అలీ మంత్రి కావాలని, వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందాలని పాదయాత్ర చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

గిరిజన గురుకులంలో ఫ్రెషర్స్ డే

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో గల గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో గురువారం రాత్రి ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంపత్, ఉపాధ్యాయులు గోవింద్, చరణ్, మున్నీ పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యుడికి మాతృవియోగం

భిక్కనూరు: భిక్కనూరు ఎంపీటీసీ-3 సభ్యుడు ఉప్పల బాబుకు శుక్రవారం మాతృవియోగం కలిగింది. బాబు తల్లి భూమవ్వ(59) వేకువజామును అకస్మత్తుగా మృతి చెందింది. విషయం తెలుసుకన్న ఎంపీపీ గాలిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్ తున్కి వేణు, మాజీ సర్పంచ్ నాగభూషణంగౌడ్‌లతో పాటు పలు పార్టీల నేతలు అధికారుల భూమవ్వ మృతదేహానికి నివాళులు అర్పించారు.

దశాబ్ది ఉత్సవాల పుస్తకాల పంపిణీ

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఎంపీడీవో నరేశ్ దశాబ్ది ఉత్సవాల పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక్కో పుస్తకం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎంపీవో యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..

తాడ్వాయి: మండలంలోని రెండు గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. కృష్ణాజివాడిలో పట్నం బాలరాజవ్వకు రూ.లక్ష, రాజేశ్వరరావుకు రూ.30 వేల చెక్కును, చిట్యాలలో రాజుకు రూ.40 వేల చెక్కులను అందజేశారు.

తహసీల్దార్‌కు సన్మానం

బాన్సువాడ రూరల్: బాన్సువాడ నూతన తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన వరప్రసాద్‌ను శుక్రవారం పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కలిశారు. ఆయనకు శాలువా, పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఉపాధ్యాయులు నర్వ శ్రీనివాస్, మంద ప్రవీణ్, హన్మాండ్లు, భూషణ్, రవీందర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి..

కామారెడ్డి క్రైం: స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహించి సిద్దిపేట జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎస్సై లక్ష్మణ్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం సన్మానించారు. శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మదన్‌లాల్, ఎస్‌బీ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, రిజర్వ్ సీఐ సుభాష్ పాల్గొన్నారు.

హోంగార్డు ఇలియాజ్‌కు..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): హోంగార్డు ఇలియాజ్ గోరిని శుక్రవారం సర్పంచ్ తిర్మల్ సన్మానించారు. మండల కేంద్రంలో ఇటీవల జరిగిన వరుస చోరీలను గోరి చేధించారన్నారు. లారీ యునియన్ అసోసియేషన్, అంబేడ్కర్ యువజన సంఘ ఆధ్వర్యంలో సన్మానించి, నగదు బహుమతి అందించారు. ఎస్సై కోనారెడ్డి, ఏఎస్సై రాములు పాల్గొన్నారు.